# గులాబీ

తెలిస్తే అతన్ని చంపేస్తారు.
తెలీకుండా ఎంత వరకూ జరిగితే అంత.
అంతే. అంతే.

అమ్మాయి పేరు గులాబీ.
ఆమెకు గులాబీలంటే ప్రాణం.
తనే ఓ గులాబీలా ఉంటుంది.
బాల్కనీలో బోలెడన్ని కుండీల్లో గులాబీ మొక్కల్ని పెంచుతోంది.
మంచు తడి ఆరని గులాబీ రేకుల మీద సూర్యుడి తొలి కిరణాలు మెరుస్తుండగా మొక్కలకు నీళ్ళు పోస్తూ అవతలి ప్రకృతిని తిలకిస్తూ పులకించడం ఆమెకు మహదానందం.
ఇంటి వెనకంతా బ్రహ్మాండమైన తోట.
చాలా పెద్ద చెట్లు. పొదలు. తీగలు.
పిట్టలు పావురాలు ఎగురుతుంటాయి. రొద చేస్తుంటాయి. తరచు కోయిలలు కూస్తుంటాయి.
ఊరవతల ఇల్లు అది.
మామయ్యగారి ఇల్లు.
చదువు కోసం ఆ ఊరొచ్చి వాళ్ళింట్లో అతిథిగా ఉంటోంది గులాబీ.
స్వంత ఊరు బాగా పల్లెటూరు. తండ్రి పెద్ద రైతు. అంతకన్న పెద్ద నాయకుడు.
కక్షలు కార్పణ్యాలతో రాజకీయాలతో రగులుతుంటాయి ఆ పల్లెలు.
ఎవరైనా కాస్త గట్టిగా నవ్వినా అదో రాజకీయమై పోతుందక్కడ.
గులాబీకి తొందరగా పెళ్ళి చేసెయ్యాలనుకున్నాడు తండ్రి. ఎప్పుడో

చేసేసే వాడు. అదేం సమస్య కాదు. చిటికేస్తే సంబంధాలు.

గులాబీయే వద్దంది. మొండికేసింది.

చదువుకుంటానంది. చదువుకుంటోంది.

అందుకే మామయ్యగారింట మకాం.

కాని గులాబీ మనస్సులో రకరకాల పరిమళాలు ఉన్నాయి. చదివి ఎవ్వర్నీ ఉద్ధరిద్దామని లేదు. డిగ్రీల కోసం చదవాలని కాదు.

సంస్కారం. నాగరికత. స్పందన. సౌందర్యం. కవిత్వం. రసానుభూతి ...వీటికోసం తహతహలాడే మనసామెది.

డిగ్రీ రెండో సంవత్సరానికే చదువు బోర్ కొట్టింది. కాలేజీలో ఏమీ లేదు. పుస్తకాల్లో ఏమీ లేదు.

జీవితంలో పెద్ద థ్రిల్ లేదు.

హృదయాన్ని తాకే అనుభూతి లేదు.

అప్పుడే చదువు ఆపేద్దామనుకుంది గులాబీ.

ఇంటికెళ్ళి పోదామనుకుంది. తండ్రి ఎవరికో ముడిపెట్టేస్తే అలాగే సెటిల్ అయిపోదామనుకుంది.

పెళ్ళిలో ఆమెకు చాయిస్ ఉండదు. తల్లి చెప్పేది కూడా ఏమీ ఉండదు. తండ్రి ఎంత చెప్తే అంతే. ఎదురు చెప్పే ప్రశ్నే లేదు.ఆ ఇంట్లో తరతరాలుగా అంతే.

పిల్లలు పెద్దలకు ఎదురు చెప్పరు. అది శాసనం.

తండ్రి అంటే పది గ్రామాలకు హడల్. కక్షల్లో ఘర్షణల్లో ప్రాణాలు తియ్యడం నిత్యకృత్యం.

అక్కడ మనసు లేదు. ఉండదు.

ఏది లేకున్నా భద్రత ఉండే జీవితం కాబట్టి వెళ్ళి పోదామనే అనుకుంది గులాబీ.

అంతలో అనుకోనిది జరిగింది.

ఎడారిలో పూల వాన కురిసింది.

బాల్కనీలో గులాబీలకి కొత్త సిగ్గులు తెలిశాయి.

అవతల తోటలోకి తొలిసారి వెళ్ళినప్పుడు గులాబీ కాళ్ళు విపరీతంగా వణికాయి.

తర్వాత ఆమె మనసంతా ఆ తోట పరిమళాలే నిండిపోయాయి...

అదిరి పడింది గులాబీ. గులాబీలన్నీ అదిరిపడ్డాయి.

అవతల తోటలో పెద్ద చెట్టు ఒకటి ఫెళఫెళ విరుగుతూ కూలిపోయింది.

గాలీ వానా లేదు. ఎవరు కూల్చేశారు?

గులాబీ కళ్ళలో గుబులు రేగింది.

గుబుర్లు నిండిన తోట వెలితి పడుతోంది.

అప్పుడే శబ్దాలన్నీ చెవిన పడ్డాయి.

కత్తులు గొడ్డళ్ళు రంపాలు చకచకా పనిచేస్తున్నాయి. చెట్లచాటున మనుషులు కిరాతకుల్లా కనిపించారు.

తోట నరికేస్తున్నారు. నిజమే. నిజంగానే. పచ్చటి తోట. కూలి పోతోంది.

అరవాలనిపించింది.

వద్దు వద్దు. నరక్కండి...అని వెళ్ళి ఆపాలనిపించింది.

తోటలో ఓ మండపం కూడా ఉంది. దాన్ని కూడా కూల్చేస్తారా?

"అత్తయ్యా...తోట నరికేస్తున్నారేంటీ?" అంటే ఆమె పనుల మధ్య ముక్తసరిగా చెప్పింది "మఠం వాళ్ళ తోట కదా...ఏదో దావాలో వుండిపోయింది ...సుప్రీం కోర్టులో కూడా కేసు కొట్టేశారట...కాలనీ అయిపోతుందేమో అంతా...ప్లాట్లు వేస్తారనుకుంటా..."

గాలాబీ కాళ్ళు వణికాయి. చెట్టులా కూలిపోతా ననిపించింది. కొమ్మల్లా తన చేతుల్ని ఎవరో నరికేస్తున్నారు...

వెళ్ళ లేక వెళ్ళింది కాలేజీకి.

బ్లాక్ బోర్డ్ వైపు చూస్తున్న కళ్ళలో పూర్తిగా చీకటే. పాఠం ఎవరిక్కావాలి?

హఠాత్తుగా రెండు చేతులు ఒళ్ళంతా పాకి వెళ్ళినట్టు...ఒళ్ళంతా ముద్రలు వేసిన పెదవులు చెవి దగ్గర నిట్టూర్చినట్టు...

"అంతేనా?" అంటున్నట్టు...

తోటలో మండపం అరుగు మీద బండరాయి అయినా ఎంత హాయి!

"గులాబీ...ఏంటా పరధ్యానం...క్లాస్ బోర్ కొడుతోందా?..." నొసలు ముడుస్తూ విసుక్కుంది మేడం.

గులాబీ అంటే మేడంకి అభిమానమే అయినా క్లాస్‌లో పరాకుని సహించదు. "నోట్స్ అయినా తీసుకోవేం?..."అంటూ రెట్టించింది.

"రియలీ బోర్ మేడం...మీరు చెప్తుంటే...తలనొప్పి వస్తోందంతే!" గులాబీ

సమాధానంతో క్లాసంతా అదిరి పడింది.

మేడం ముఖం కోపంతో జేవురించింది. "అయితే నా క్లాస్‌లో ఏం పని? ప్లీజ్ గో ఔట్!"

"ఇట్స్ ఓకే మేడం…"అంటూ చివాలున సీటు లోంచి లేచి వెళ్ళిపోయింది గులాబీ.

క్లాస్‌లో అందరి ముఖాలూ పాలిపోయాయి.

గులాబీకి ఎక్కడికెళ్ళాలో తోచలేదు.

కాలేజీ కేంపస్ నిండా చెట్లున్నాయి. పెద్ద పెద్ద చెట్లు. ఎప్పటివో వృక్షాలు.

వీటిని కొట్టెయ్యరెందుకు? నరికెయ్య రెందుకు?

ఆ తోటనే నరికెయ్యాలా? దారుణం…

లైబ్రరీలో ఓ మూల పుస్తకాల రాక్ పక్కన కుర్చీలో కూలబడి డెస్క్ మీద తల వాల్చేసింది గులాబీ.

కుర్చీలు టేబుళ్ళు అన్నీ చెక్కతోనే చేస్తారు. ఎన్ని చెట్లని కొట్టేశారో…

"గులాబీ…ఏంటమ్మా ఇదీ?…" మేడం గొంతు ఈసారి అనునయంగా ఉంది. క్లాస్ అయిపోగానే లైబ్రరీకొచ్చింది మేడం.

"సారీ మేడం…మీరు బోరెత్తించారని కాదు…"

"ఎనీథింగ్ రాంగ్ గులాబీ?…"

"ఎవ్రీథింగ్" అనేసి అంతలోనే "నథింగ్ మేడం నథింగ్" అంటూ వచ్చేసింది గులాబీ.

అవును. తోట ఏమైతే ఎవరి కేమిటి? ఏమీ కాదు…

కాలేజీ నుంచి రాగానే కాళ్ళు బాల్కనీ వైపే లాగాయి. ఘోరం. ఘోరం జరిగి పోయింది.

తోట లేదు. మాయమై పోయింది.

సాయంత్రం ముదురుతుండగా ఆఖరు వెల్తురులో తెగిపడిన చెట్లు నిశ్శబ్దంగా రోదిస్తున్నాయి.

వాటి మధ్య ఏకాకిగా అసహాయంగా దీనంగా ఉంది రాతి మండపం. ఇది వరకు బాల్కనీ నుంచి అది కనపడేది కాదు. చెట్ల నీడల కింద కమ్మటి కలలాగా ఉండేది.

గులాబీ కళ్ళలో నీరు చిమ్ముకొస్తోంది. బాల్కనీ లోంచి దూకెయ్యాలన్న కోరికను బలవంతంగా అణచుకుంటోంది.

"అమ్మాయ్ గులాబీ...కాఫీ కలుపుకోవూ?..." వంటింట్లోంచి అత్తయ్య పిలుపు కర్ణ కఠోరంగా వినిపించిది.

నేను కాఫీ తాగితే ఏమిటి తాగక పోతే ఏమిటి? నాలాంటి ఆడపిల్ల ఏమైతే లోకానికేమిటి?...అనే స్వగతం గులాబీ గుండె లోనే మెలితిరిగింది.

స్వగతాలు స్వగతాలే. పైకి రాకూడదు.

కాఫీ కలుపుకుంటోంది గులాబీ.

చెవుల్లో ఏవేవో శబ్దాలు ప్రతిధ్వనిస్తున్నాయి.

ఇక తోటలోకి వెళ్ళే ప్రసక్తి లేదు. అసాధ్యం. ఎవరు వెళ్ళినా చుట్టు పక్కల ఇళ్ళ వాళ్ళందరికీ తెలుస్తుంది. కిటికీల గుండా బాల్కనీల గుండా ఎన్నో కళ్ళు.

చెట్లూ గుబుర్లూ లేని తోట తోటే కాదు.

రోజూ వెళ్ళేది కాదు గులాబీ. నెలలో రెండు మూడు సార్లు. అంతే.

ఎవ్వరికీ అనుమానం రాని రీతిలో. అంతే.

బయట ఎక్కడా ఎవరితోగాని మాట్లాడదు. అంటే మగవాళ్ళతో అన్నమాట...

బస్‌స్టాప్‌కి వస్తూ పోతూ తల తిప్పి కూడా చూడదు. ఎవరైనా అబ్బాయిలు టీజ్ చేసినా లక్ష్య పెట్టదు. దాంతో వాళ్ళందరికీ శృంగభంగం.

గులాబీ సౌందర్యంలో ఓ దర్జా ఉంది. ఒక ఠీవి ఉంది. ఒక దర్పం. అతిలోక మైన తేజస్సు.

మామూలు వాళ్ళకి ఆమె ముఖంలోకి చూసేంత ధైర్యం ఉండదు.

తోటలోకి వెళ్ళేది కాదు. వెళ్ళింది. కాని రహస్యం.

కులం మతం హోదా అంతస్థు...అన్నీ అడ్డు గోడ లైనప్పుడు ఎక్కువమంది ఆ గోడల మధ్యే హాయిని వెతుక్కుంటారు.

ఇమడ లేని సాహసికులు కొందరు గోడలు దాటడానికి ప్రయత్నిస్తారు. దాటేస్తారు.

కొందరు గోడలు ఎక్కబోయి దొరికిపోయి పట్టు జారి పడిపోయి భంగ పడతారు.

కొందరు గోడల కింద నీడల్లోనే గోప్యంగా అందినంత ఆనందాల్ని

జుర్రుకుంటారు. కసి తీర్చుకుంటారు. గోడల మీద కసి. పగ. ప్రతీకారం. అదో తృప్తి.

కాఫీ కాస్త చప్పరించి "ఛీ" అనుకుంది గులాబీ. మరీ చేదు. పరధ్యానంలో కాఫీ పొడి ఎక్కువ వేసింది. కటిక చేదు.

చిరాకుతో కప్పు విసిరి కొట్టింది. గోడకి తగిలి భళ్ళున పగిలింది కప్పు.

ప్రపంచాన్నే పగల గొట్టాలని ఉంది.

"గులాబీ...ఏమైందమ్మా?..." అత్తయ్య గాభరాగా అడిగింది ప్రక్క రూం లోంచి.

"కప్పు...జారి పడిందత్తయ్యా..."అనేసి చరచరా తన రూంలోకి వచ్చి మంచం మీద వాలిపోయింది గులాబీ. శక్తి లేదు.

ఏడవాలని ఉన్నా ఏడుపు రాదు.

అప్పుడే వచ్చినట్టున్నాడు మామయ్య. అత్తయ్య తన కలవరపాటునంతా వర్ణించి చెప్తోంది...

"గులాబీకి ఏమైందోనండీ...ప్రొద్దుట్నుంచి అలాగే ఉంది ...చూడండి...కప్పు జారి పడితే...కాఫీ మరకలు గోడకెందు కవుతాయి?...కప్పు ముక్కలు అక్కడ...గోడ వార ఎందుకు పడతాయి?..."

ఏం చెప్పాలి వాళ్ళకు? ఎలా చెప్పాలి?

ఎలా చెప్పకుండా ఉండాలి?

రాత్రంతా పక్క మీద పొర్లుతూనే ఉంది గులాబీ. మంచం మాయమైపోయి తోట మండపంలో దిగితే బావుణ్ణు.

చుట్టుకునే చేతులకు కడసారి వీడ్కోలు చెప్పొద్దా? ఆర్తిగా చూసుకునే కళ్ళ మీద కోటి ముద్దుల కానుకలు ఇవ్వొద్దా? ఒక్కసారి మరొక్క సారి ఆ కౌగిలిలో కరిగి పోవద్దా?

అసాధ్యం అంటోంది రాత్రి చీకటి.

తెలతెలవారక ముందే బాల్కనీలోకి వెళ్ళింది గులాబీ. మసక వెన్నెల్లో జాలిగా ఊగుతున్నాయి గులాబీలు.

ఉలిక్కి పడింది గులాబీ.

ఎన్నో గులాబీలు...రేకులు రాలిపోయాయి. వాడి పోయాయి...అంతే.

గులాబీల బ్రతుకంతే.

పరిమళించే బ్రతుకు కొంత సేపే!

మరుసటి రోజు ఉదయం చూడ లేక చూసింది గులాబీ తోటలోకి. కోసిపడ్డ తోట లోకి.

పగబట్టి వచ్చేశారు పనివాళ్ళు. చాలామంది ఇంకా వస్తున్నారు. కొట్టేసిన చెట్లని దుంగలు దుంగలుగా నరుకుతున్నారు. కంప చెట్లు కాల్చేస్తున్నారు. నరికిన దుంగల్ని లారీల్లో తరలిస్తున్నారు.

హఠాత్తుగా మొదలయింది బండరాళ్ళ మీద గునపాల శబ్దం.

గుంపుగా ఎగబడ్డ కూలీలు మండపాన్ని కూల్చేస్తున్నారు.

ఒక్కో గునపం పోటు...గులాబీ గుండెల్లో దిగుతోంది.

ఆమె మెదడులో వలయాలు తిరుగుతున్నాయి.

సరిగ్గా ఇదే సమయానికి మరో జత కళ్ళు తను చూసినట్టే చూస్తుంటాయి ఈ దృశ్యాన్ని.

ఆ కళ్ళలో మంటలు మండుతుంటాయి.

ఆ మనసు నిశ్శబ్దంగా చీలిపోతూ ఉంటుంది.

అన్నీ గుర్తుంటాయి. చేతలు. మాటలు. ప్రమాణాలు. అన్నీగుర్తుంటాయి.

ఎప్పుడు కథ అడ్డం తిరిగినా ఎలా అడ్డం తిరిగినా ఏ క్షణంలో స్వర్గం నరకమైపోయినా...

గప్‌చుప్. బైట పడకూడదు. ప్రేమ మీద ఒట్టు. మనసు మీద ఒట్టు. అది శిలా శాసనం.

మండపం పైకప్పు కూలుతోంది.

చూడ లేక ఇవతలి కొచ్చేసింది గులాబీ.

"ఒంట్లో బాగులేకుంటే...కాలేజీకి వెళ్ళొద్దులే గులాబీ..." అంది అత్తయ్య.

"వెళ్ళకుంటే అసలు బాగుండదు అత్తయ్యా..." అంటూ హడావుడిగా తయారైంది గులాబీ.

ఆ మాట అత్తయ్యకు ఎలా అర్థమౌతుంది?

ఎవరికీ అర్థం కాకూడదు కూడా!

మరుసటి రోజు... ఆ మరుసటి రోజు...

పరిస్థితి ఇంకా దిగజారి పోయింది. గులాబీ మనస్సు ఊగిపోతోంది.

కాలేజీ వద్దు. ఈ ఇల్లు వద్దు. రాకపోకలు వద్దు. బాల్కనీ వద్దు. ఆ గులాబీలు వద్దు.

చదువే వద్దు. ఆశలే వద్దు.

అత్తయ్యా మామయ్యా భయపడి పోయారు.

ఏం లోపం జరిగిందోనని కలవర పడ్డారు.

"ప్లీజ్...నన్ను నమ్మండి...నాకేంటో డల్‌గా ఉంది...ఇంటి మీద బెంగగా ఉంది...కొద్ది రోజులు రెస్ట్ తీసుకుని...మళ్ళీ రావలనిపిస్తే...వస్తాను..."అని ఎలాగో నచ్చజెప్పి బయలుదేరింది గులాబీ.

మామయ్య తోడు వస్తానన్నాడు గాని వద్దంది.

ఆఖరు సారయినా ఇక బాల్కనీలోకి వెళ్ళలేదు. మండపం లేని తోట. తోట లేని మైదానం...ఎందుకూ?...

గుండెల్లో రైలులా కదుల్తోంది రైలు.

పై బెర్త్ మీద ముడుక్కుని పడుకుంది గులాబీ. అందరూ రాత్రి నిద్రలో జోగుతున్నారు.

సూట్‌కేస్ కెలికి ప్లాస్టిక్ కవర్‌లో భద్రంగా దాచుకున్న ఓ ఫోటో బైటకి తీసింది గులాబీ.

మసక వెల్తురులో ఆ ఫోటో వైపు చూస్తుంటే వేరే లోకాన్ని చూస్తున్నట్టే ఉంది.

పచ్చటి తోటలో ఎండ పొడల మధ్య రాతి మండపం. స్తంభాన్ని ఆనుకుని శిల్పంలా కూచుని నవ్వుతోంది గులాబీ. ముందుకు వేసుకున్న జడ వారగా ఓ గులాబీ తొంగి చూస్తోంది.

ఆ క్షణం ఆ ఫోటో తీసిన కెమెరా వెనుక అపురూపంగా మెరిసింది ఓ కన్ను.

ప్రపంచంలో ఎవరికీ తెలీదు.

ఎప్పటికీ తెలీదు.

ఈ సరికి ఆ కన్ను కుమిలిపోతున్నా...ఎప్పటికీ కుమిలినా...

ఎవరికీ పట్టదు. పట్ట కూడదు. అంతే.

ఫోటో మీద టపటప మని రాలి పడ్డాయి గులాబీ కన్నీటి బిందువులు.

ఫోటోని గుండెల కేసి హత్తుకుంటూ కళ్ళు మూసుకుంది గులాబీ.

ఇప్పుడు మండపం లేక పోవచ్చు. తోట లేక పోవచ్చు. కాని ఒకప్పుడు అద్భుతంగా పరవశించింది ఈ బ్రతుకు ఆ నీడల్లో...

ఏదో తృప్తి. గర్వం. అతిశయం.

గులాబీలు ఎప్పటికీ ఉండవు. కొంత సేపే...అంటోంది ఫోటోని పొదువుకున్న గుండె.

అంతే మరి. అంతే మరి అంటున్నాయి రైలు చక్రాలు.

ఇప్పుడు గులాబీ నవ్వుకుంటోంది. మనస్సు నిండా ఎవరో నవ్వుతున్నారు. ఆమె వింటోంది. వింటూనే ఉంది...